ప్రతిపాదనలు పంపించండి

- రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ ఆదేశం
- అమీర్‌పేట్ వైద్యశాలను ఆకస్మిక తనిఖీ చేసిన కమిషనర్

అమీర్‌పేట్, డిసెంబర్ 18: తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ బుధవారం ఉదయం అమీర్‌పేట్‌లోని 50 పడకల ప్రభుత్వ వైద్యశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఉదయం ఆసుపత్రికి చేరుకున్న కమిషనర్ నేరుగా వైద్య పరీక్షల కోసం వచ్చి ఉన్న రోగులతో మాట్లాడారు. వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ రవూఫ్, ఆర్ఎంవో డాక్టర్ వినాయక్, మాజీ సూపరింటెండెంట్ దశరథ్‌లతో కలిసి దవాఖానలోని సాధారణ వైద్యం, పిల్లల వార్డు, గైనిక్, ఆపరేషన్ థియేటర్, రికార్డులు, మందులు, ఇన్ పేషెంట్ల వార్డులను సందర్శించి అక్కడ పరిస్థితులను పరిశీలించారు. అందుబాటులో ఉన్న మందులు, డయాగ్నసిస్ సేవలపై రోగుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన వైద్యుల నియామకాల్లో భాగంగా అమీర్‌పేట్ ఆసుపత్రికి ఇద్దరు వైద్యులను మంజూరు చేసింది. దీంతో ఆసుపత్రిలో ఇప్పుడు అందుబాటులో ఉన్న విభాగాలకు తోడు కొత్తగా ఈఎన్‌టీ, కంటి విభాగాలు తోడయ్యాయి. వైద్యుల నియామకం జరిగినా, వైద్య పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన వైద్య పరికరాలు అందుబాటులో లేవంటూ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవూఫ్ టీవీవీపీ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన పరికరాలకు సంబంధించి వెంటనే టీవీవీపీకి దరఖాస్తు చేయాలని కమిషనర్ సూచించారు. పరికరాలను సమకూర్చేందుకు సహకరిస్తానని కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ పేర్కొన్నారు.

ఇన్ పేషెంట్‌తో మాట్లాడుతున్న కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్

అంబేద్కర్‌నగర్ బస్తీ అధ్యక్షుడి మృతి

ఎన్.అంజయ్య ముదిరాజ్ (ఫైల్)

మారేడ్‌పల్లి, డిసెంబర్ 18: మోండా డివిజన్ రైల్‌నిలయం అంబేద్కర్‌నగర్ బస్తీ ఫౌండర్, అధ్యక్షుడు ఎన్.అంజయ్యముదిరాజ్ బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సికింద్రాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. అంబేద్కర్‌నగర్‌లోని తన నివాసానికి పెద్ద ఎత్తున బస్తీవాసులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు చేరుకొని ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బస్తీ అభివృద్ధికి, ఇండ్ల నిర్మాణం కోసం ఆయన చేసిన సేవలను పలువురు గుర్తు చేసుకొని కన్నీరుమున్నీరుగా విలపించారు. గురువారం మధ్యాహ్నం మారేడ్‌పల్లిలోని హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. అంజయ్యకు భార్య అంబిక, కుమార్తె రాజేశ్వరి, ఇద్దరు కుమారులు శివకుమార్, శ్రీనివాస్ ఉన్నారు.

జీడీఏ కోర్సులో ఉచిత శిక్షణ

బేగంపేట్, డిసెంబర్ 18: బొల్లినేని మెడిస్కిల్స్ ఆధ్వర్యంలో జీడీఏ కోర్సులో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించనున్నట్టు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వర్‌రావు తెలిపారు. కోర్సు చేసేందుకు 20 నుంచి 35 ఏండ్ల లోపు విద్యార్థులు అర్హులన్నారు. పదవ తరగతి పాసైన వారు కోర్సులో చేరవచ్చునని తెలిపారు. మూడు నెలల శిక్షణ పూర్తి అయిన వెంటనే కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉద్యోగాలు కల్పించనున్నట్టు చెప్పారు. పూర్తి వివరాలకు 82472 55859, 63000 61059 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు బొల్లినేని మెడిస్కిల్స్, నాలుగో అంతస్తు ప్యారడైజ్ పాత సన్ ఫైన్ ఆసుపత్రి పైన కార్యాలయానికి వచ్చి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

అంగన్‌వాడీల్లో సమస్యలు పరిష్కరించాలి

సీడీపీఓ స్వప్నకు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేస్తున్న బాలల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధులు

అడ్డగుట్ట, డిసెంబర్ 18: మారేడుపల్లి మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోరుతూ సీడీపీఓ డాక్టర్ స్వప్నకు బాలల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధులు బుధవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. మండల పరిధిలోని చాలా వరకు కేంద్రాల్లో మంచినీటి, కరెంట్ సమస్య తీవ్రంగా ఉందని అన్నారు. అంతేకాకుండా అద్దె భవనాలకు సమయానికి అద్దె రావడం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉపాధ్యాయులు ఉంటే ఆయా ఉండడం లేదు, ఆయా ఉంటే టీచర్ ఉండడం లేదని వారు సీడీపీఓకి తెలియజేశారు. తుకారాంగేట్ గడ్డమీది బస్తీ కేంద్రంలో టీచర్, ఆయా ఇద్దరు లేకపోవడంతో పిల్లల పరిస్థితి దారుణంగా మారిందని పేర్కొన్నారు. సీడీపీఓను కలిసిన వారిలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక, తల్లుల సంఘం ప్రతినిధులు భాగ్య, రమాదేవి, ప్రవీణ్, ఎంవీ ఫౌండేషన్ ఆర్గనైజర్స్ ఎ.సువర్ణ, బి.భాగ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకూ పోరాటం

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గజ్జెల నాగేశ్

గజ్జెల నాగేశ్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు

కంటోన్మెంట్, డిసెంబర్ 18: లగచర్ల రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ తరపున పోరాటం చేస్తామని ఆ పార్టీ సీనియర్ నాయకుడు గజ్జెల నాగేశ్ స్పష్టం చేశారు. రైతు వ్యతిరేకి రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం ప్రజల దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు. భూముల కోసం రైతులపై అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపిన దుర్మార్గమైన చరిత్ర ఆయనదని తీవ్రంగా విమర్శించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లగచర్ల రైతులపై వెంటనే కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. గిరిజన రైతుల భూములను అక్రమంగా లాక్కోవడానికి ప్రయత్నించడం సిగ్గు చేటన్నారు. గిరిజనులకు మద్దతుగా బీఆర్ఎస్ ఉద్యమించడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గిందన్నారు. గిరిజన రైతులతో పాటు మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిపైనా పెట్టిన కేసులను ఎత్తివేసి, వారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతన్నలపై అరాచకాలు, అణచివేతలు జరుగుతున్నాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కుట్రల నుంచి లగచర్ల రైతన్నలను కాపాడాలన్నారు. గిరిజనుల భూములను బలవంతంగా లాక్కునేందుకు ప్రభుత్వం కుట్ర చేసిందని విమర్శించారు. అందుకోసమే ఫార్మా సిటీ, ఇండస్ట్రియల్ కారిడార్ పేర్లతో మాయమాటలు చెబుతూ, ఎలాగైనా భూములు లాక్కుని తన అల్లుడికి అప్పజెప్పాలని సీఎం యత్నిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ రైతులకు తొలి ప్రాధాన్యం కల్పించారని కొనియాడారు. రైతులను రాజులుగా మార్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని చెప్పారు.

అరుణ్‌జ్యోతికాలనీలో అయ్యప్ప పడిపూజ


ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న మహేశ్ గురుస్వామి, తదితరులు

బన్సీలాల్‌పేట్, డిసెంబర్ 18: అరుణ్‌జ్యోతికాలనీలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద బండి మహేశ్‌కుమార్ గురుస్వామి ఆధ్వర్యంలో 18వ అయ్యప్పస్వామి పడిపూజ ఘనంగా జరిగింది. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్‌యాదవ్ పూజకు హాజరయ్యారు. ఈ సందర్భంగా గురుస్వామి వారిద్దరిని సన్మానించారు. కాలనీ నాయకులు భరత్‌కుమార్, సుధీర్, బీఆర్ఎస్ నాయకులు బండి శాంతికుమార్, రాహుల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కంటి అద్దాల పంపిణీ

కంటి అద్దాలను పొందిన మహిళలతో రోటరీ క్లబ్ ప్రతినిధులు

అడ్డగుట్ట, డిసెంబర్ 18: మెట్టుగూడ దూద్‌బావి ప్రాథమిక పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో డిసెంబర్ 1న కంటి పరీక్షలు నిర్వహించుకున్న 144 మందికి కంటి అద్దాలను క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ ఎలెక్టెడ్ రాంప్రసాద్, అధ్యక్షుడు బాలకోటి రెడ్డి అందజేశారు. వారు మాట్లాడుతూ ఉచిత వైద్య పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రోటరీ క్లబ్, పుష్పగిరి కంటి ఆసుపత్రి ఇన్‌చార్జి ఆనంద్, క్యాంప్ ఇన్‌చార్జి అరుణ్, స్కూల్ ప్రధానోపాధ్యయుడు మల్లికార్జున్‌రెడ్డి, టీచర్లు అయేషా అంజూమ్, మల్లేశ్వరి, హసీనా బేగం, సాలెహా, షమీనా సుల్తానా, శిరీష, బస్తీవాసులు మల్లేశ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ ఉద్యోగుల హౌసింగ్ సొసైటీ ఎన్నికలకు నోటిఫికేషన్

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 18: ఓయూ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఎన్నికల అధికారి లక్ష్మీనారాయణ విడుదల చేశారు. సీక్రెట్ బ్యాలెట్ విధానం ద్వారా నిర్వహించనున్న ఎన్నికల్లో మొత్తం తొమ్మిది మందిని ఎన్నుకోనున్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 28న ఉదయం 11 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు వర్సిటీలోని ఎలక్ట్రికల్ సెక్షన్ కార్యాలయంలో నామినేషన్లను స్వీకరించనున్నట్లు చెప్పారు. 29న నామినేషన్లను పరిశీలించి, చెల్లుబాటయ్యే నామినేషన్లను ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. నామినేషన్ల ఉపసంహరణను 30న అవకాశం కల్పించామని, అర్హులైన నామినేషన్ల జాబితాను అదేరోజు సాయంత్రం నాలుగు గంటలకు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. వచ్చే నెల 5న నాన్ టీచింగ్ హోంలో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఎన్నికలు ముగిసిన అనంతరం ఓట్లను లెక్కించి, ఫలితాలను విడుదల చేస్తామని వివరించారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో డ్రైనేజీ పనుల పూర్తి

బోయిగూడలో డ్రైనేజీ పనులు చేపట్టిన జలమండలి సిబ్బంది

బన్సీలాల్‌పేట్, డిసెంబర్ 18: న్యూబోయిగూడలోని గొల్లకొమరయ్యకాలనీలో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మంగళవారం పర్యటించారు. కాగా డ్రైనేజీ సమస్య ఉందని స్థానికులు ఫిర్యాదు చేశారు. కాగా బుధవారం మ్యాన్‌హోళ్ల మరమ్మతు పనులు జలమండలి సిబ్బంది పూర్తి చేశారు. ఎమ్మెల్యే తలసాని స్పందించి ఆధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మరుసటి రోజే పనులు పూర్తి కావడం పట్ల బస్తీవాసులు హర్షం వ్యక్తం చేశారని బన్సీలాల్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు, యూత్ అధ్యక్షుడు వెంకట్ పేర్కొన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే ఎమ్మెల్యే తలసానికి గొల్లకొమరయ్య కాలనీ ప్రధాన కార్యదర్శి ఈ.నర్సింగ్‌రావు, కోశాధికారి వినోద్ కుమార్, మనీశ్‌కుమార్, బస్తీవాసులు ధన్యవాదాలు తెలిపారు.

నటుడు కోటకు శ్రీభారతి పురస్కారం

సినీ నటుడు కోట శ్రీనివాసరావుకు పురస్కారం అందజేస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి

ముషీరాబాద్, డిసెంబర్ 18: శ్రీభారతి ఫౌండేషన్, శ్రీభారతి మ్యూజిక్ అకాడమి ఆధ్వర్యంలో ప్రముఖ గాయకులు మాధవపెద్ది సత్యం వర్ధంతి సందర్భంగా వివిధ రంగాల ప్రముఖులకు శ్రీభారతి పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ మాజీ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి పాల్గొని సినీ నటుడు కోట శ్రీనివాసరావుకు శ్రీభారతి–మాధవపెద్ది సత్య స్మారక పురస్కారాన్ని అందజేశారు. అదేవిధంగా మణిశాస్త్రి, సురేఖ, ఎంవీ రమణకుమారి, శైలజకు శ్రీభారతి పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాధవపెద్ది మూర్తి, గాయకుడు మాదవపెద్ది సురేశ్, మన్యం కృష్ణకిశోర్‌రెడ్డి, కంటమనేని శివ, రావుల వెంకటేశ్వరరావు, పి.కోటేశ్వరి, ఎల్వీ చెన్నారావు, పొత్తూరి రంగారావు, వినోద్‌కుమార్, తనికెళ్ల సూర్యమీనాక్షి, డాక్టర్ నిట్టల గోపాలకృష్ణ, శ్రీభారతి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చింతలపాటి సురేశ్, శోభరాణి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయం ముగ్గురి అరెస్ట్

బంజారాహిల్స్: విశాఖపట్నంలో గంజాయి కొనుగోలు చేస్తున్న ఓ వ్యక్తితో పాటు గంజాయి కొనేందుకు వచ్చిన మరో ఇద్దరిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. విశాఖపట్నం జిల్లాకు చెందిన సౌబండి ప్రేమ్‌కుమార్(21) బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 2లోని ఇందిరానగర్‌లో నివాసం ఉంటూ యానిమేషన్‌గా పనిచేస్తుంటాడు. తన జిల్లాకు చెందిన శంకర్ అనే వ్యక్తి వద్దనుంచి గంజాయి కొనుగోలు చేసి నగరానికి తెచ్చి కష్టమర్లకు విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో ఇందిరానగర్‌లో ప్రేమ్‌కుమార్ కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు మంగళవారం రాత్రి అరెస్ట్ చేశారు.అతడితో పాటు గంజాయి కొనుకున్ననేందుకు వచ్చిన నందినగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ బానోత్‌లక్ష్మణ్ నాయక్(24), లఖన్ మలాకర్(23) అనే కుక్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. వీరివద్దనుంచి 2కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు.

వ్యక్తి అదృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: మద్యానికి డబ్బులివ్వలేదని కనిపించకుండాపోయిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం మైలార్‌దేవ్‌పల్లి వెంకటేశ్వర కాలనీకి చెందిన నర్సింహులు (53) లేబర్. మద్యానికి బానిసై ఇంట్లో తరచూ డబ్బుల కోసం అడిగేవాడు. ఈనెల 16న ఇంట్లో మద్య ం కోసం డబ్బులు అడుగగా వారు ఇవ్వలేదు. సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకాబు చేశారు. ఆచూకీ లభించకపోవడంతో మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్రిస్మస్ ప్రార్థనల్లో పాల్గొన్న ప్రముఖులు

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ హేమ

బేగంపేట్, డిసెంబర్ 18: యునైటెడ్ క్రిస్టమస్ సెలబ్రేషన్స్ కమిటీ, తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ ఆధ్వర్యంలో 16వ గ్రేటర్ హైదరాబాద్ క్రిస్మస్ ఉత్సవాలు బుధవారం సికింద్రాబాద్ ఎస్పీ రోడ్డులోని వెస్లీ పీజీ కాలేజ్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరయ్యారు. ఏసుక్రీస్తు అందించిన సందేశం అందరిని ఏకం చేస్తుందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ జీడీ అరుణ, బిషప్‌లు తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్: పద్మారావునగర్‌లోని వెస్లి చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో కార్పొరేటర్ సామల హేమ పాల్గొన్నారు. ప్రజలందరికీ క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జరిగే క్రిస్మస్ వేడుకలకు తనను ఆహ్వానించడం సంతోషాన్ని కలిగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ప్రసన్నకుమార్, పూర్ణిమ, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

21న న్యాయ విద్యార్థుల సదస్సు

చిక్కడపల్లి, డిసెంబర్ 18: అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలు), భారత న్యాయ విద్యార్థుల సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 21 సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రాష్ట్ర 2వ న్యాయ విద్యార్థుల సదస్సును జయప్రదం చేయాలని ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్థసారథి, సమాఖ్య కన్వీనర్ అలీ న్యాయ విద్యార్థులకు పిలుపునిచ్చారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రెండు సంఘాల ఆధ్వర్యంలో సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టరును ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ యువత ప్రతిభను పెంపొందించాలని, న్యాయ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, రాజ్యాంగ విలువలు, లౌకిక తత్త్వం, స్వేచ్ఛ సమానత్వం కాపాడుకోవాల్సిన రోజులు వచ్చాయని పేర్కొన్నారు. సదస్సుకు సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది పీవీ సురేంద్రనాథ్, నేషనల్ లా స్కూల్ పూర్వ వీసీ ప్రొఫెసర్ మోహన్‌గోపాల్ హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఐటీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు సి.రామచంద్రారెడ్డి, ఎల్ఎస్ఎఫ్ఐ నాయకులు క్రాంతి, రవితేజ, అనిల్‌కుమార్, అశోక్‌కుమార్, క్రాంతి, హుస్సేన్, వంశీ, సాయినాథ్, సాయితేజ్, అలిజాన్, తహీద్ పాల్గొన్నారు.

సేవ చేశాం.. మరోసారి అవకాశం ఇవ్వండి


సంగారెడ్డి జిల్లా డీసీఎల్ రవీందర్‌రెడ్డికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న వి.శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

చిక్కడపల్లి, డిసెంబర్ 18: వీఎస్టీ కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా పని చేశామని వీఎస్టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వీఎస్టీ వర్కర్స్ యూనియన్ ఎన్నికల సందర్భంగా బుధవారం బాగ్‌లింగంపల్లిలోని సాయిబాబా ఆలయం, విద్యానగర్ కట్ట మైసమ్మ ఆలయంలో పూజలు చేశారు. బాగ్‌లింగంపల్లి యూనియన్ కార్యాలయం వద్ద భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంగారెడ్డి కార్మిక కార్యాలయానికి చేరుకున్నారు. ఎన్ఎన్ రెడ్డి గ్రూప్ తరపున శ్రీనివాస్ రెడ్డి డీసీఎల్ రవీందర్‌రెడ్డికి నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం పని చేసినందుకు ఐదుసార్లు మెజార్టీతో తమను గెలిపించారని గుర్తుచేశారు. కార్మికులకు మంచి వేతన ఒప్పందాలు చేస్తూ వచ్చామని అన్నారు. 2016లో తాను గెలిచినప్పటి నుంచి 200 మందికి పైగా నూతనంగా నియామకం చెపట్టినట్టు తెలిపారు. రిటైర్ అవుతున్న వారి పిల్లలకు నియామకాల్లో 100 శాతం న్యాయం జరిగేలా కృషి చేస్తామని చెప్పారు. మరోసారి అవకాశం ఇవ్వాలని కార్మికులకు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఐలీ ప్రభాకర్, బాబి, రవియాదవ్, శంకర్, మధూసుదన్, సత్యనారాయణ, రాములు, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సహకార వ్యవస్థ బలోపేతం కోసం కృషి

మాట్లాడుతున్న సహకార యూనియన్ చైర్మన్ మోహన్‌రెడ్డి

చిక్కడపల్లి, డిసెంబర్ 18: సహకార వ్యవస్థ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగుతామని తెలంగాణ సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మనాల మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సహకార యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సహకార వ్యవస్థ ప్రమాంలో ఉందని సంఘాలతో కలిసి బలోపేతం చేయడానికి ముందుకుసాగుతామని చెప్పారు. సహకార చట్టాలను, సహకార సంఘాల్లో చేసుకునే వ్యాపారాలపై అవగాహ కల్పించే కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. సమావేశంలో సహకార యూనియన్ ఎండీ అన్నపూర్ణ, నేషనల్ బ్యాంక్ ఫెడరేషన్ చైర్మన్ కె.రవీందర్‌రావు, మర్క్‌ఫెడ్ చైర్మన ఎం.గంగారెడ్డి, అయిల్‌ఫెడ్ చైర్మన్ జె.రాఘవరెడ్డి, నల్గొండ జిల్లా కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మెదక్ జిల్లా కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, ఆదిలాబాద్ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఇ.బోజీరెడ్డి పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం

సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో ప్రమాణ స్వీకరాం చేస్తున్న రాజ్‌కుమార్

మారేడ్‌పల్లి, డిసెంబర్ 18: తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్ ప్రమాణ స్వీకారోత్సవం సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి రాష్ట్ర నలుమూల నుంచి వందలాది మంది పద్మశాలీలు హాజరైయ్యారు. రెండు నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో ఆయన రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. స్పెషల్ జుడీషియరీ మేజిస్ట్రేట్ నామాల అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయనతో పాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. పద్మశాలీయుల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు, గోవర్ధన్, నర్సయ్య, రమేశ్, రంగయ్య, శ్రీనివాస్, బుర్రా మల్లేశం, వేముల బాల్‌రాజ్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

That my client, Mr. Aditya Narayana, S/o. Y.V. Srinivas, have filed a suit bearing O.S. No. 711 of 2024 has been filed before the Court of the V Senior Civil Judge, City Civil Court, Hyderabad. The suit is for Partition against the Defendants: 1. Y.V. Srinivas, S/o. Yilapavaram Yagnanarayana Sharama, 2. Y.V. Sridhar, S/o. Yilapavaram Yagnanarayana Sharama, 3. Y.V. Srikar, S/o. Yilapavaram Yagnanarayana Sharama.

Additionally, an interim application I.A. No. 537 of 2024 has been filed in the said suit seeking an ad-interim injunction restraining the Respondents from alienating the property mentioned in the schedule below to third parties. After hearing the petitioner's counsel, the Hon'ble Court, on 17-12-2024, ordered the issuance of urgent notice.

Members of the general public are hereby cautioned not to enter into any transactions concerning the property mentioned in the suit schedule with the above named Defendants or their representatives. Any such transaction will be at their own risk and in violation of the Court's orders.

SCHEDULE OF PROPERTY

All that property bearing H.No. 1-3-183/49/9/E/2, Plot No. 29, situated in Bakaram/Gaganmahal Village, also known as Bakaram Area, Hyderabad Urban Taluk, measuring 163 Sq.yards. **BOUNDARIES: North:** Plot No. 25, **South:** 50 Feet wide Road, **East:** Plot No. 28, **West:** 40 Feet wide Road.

(N. ASHWINI), Advocate
114, Paras Chambers,
Beside Telangana Tourism Building,
Himayath Nagar, Hyderabad-29,
Mobile: +91-9100428663,
Email: ashwininomula4091@gmail.com